




# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు








సంపుటి : 11 సంచిక :58 పేజీలు : 12 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : విశాఖపట్నం ఆదివారం 3 నవంబర్ 2024 వెల : 5/-రూ॥

VOLUME :11 ISSUE :58 PAGES : 12 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : VISAKHAPATNAM SUN 3 NOVEMBER 2024 PRICE : 5/- RS

*Simultaneously Published form Visakhapatnam, Kakinada, Ongole Circulated by Srikakulam,Vizianagaram, Eluru,Vijayawada,Guntur, Prakasam,Nelloru,Chittur,YSR Kadapa, Kurnool, Anantapur*


## నేను చాలా దేశాలు తిరిగాను కానీ ఇంత లగ్జరీ చూడలేదు

- రుషికొండ ప్యాలెస్ ను పరిశీలించిన చంద్రబాబు
- చాలా ఆశ్చర్యంగా ఉందని వెల్లడి
- లగ్జరీ అదిరిపోయిందని వ్యాఖ్యలు
- ఎక్కడ్నించి చూసినా సీ వ్యూ కనిపించేలా కట్టారని వివరణ
- ఇలాంటి లగ్జరీని కలలో కూడా ఊహించలేమన్న చంద్రబాబు



పెన్ పవర్ డెస్క్:ఏపీ సీఎం చంద్రబాబు విశాఖలో రుషికొండ భవనాలను పరిశీ లించారు. అనంతరం అక్కడే మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రుషికొండపై కట్టిన భవనాలు చూశాక ఆశ్చర్యం, ఉద్వేగం కలిగాయని పేర్కొన్నారు. టూరిజం డెవలప్ మెంట్ కోసమే ఈ భవనాలు నిర్మించినట్టు గత ప్రభుత్వంలో అనేకసార్లు చెప్పారని, కానీ ఢిల్లీ పెద్దలు వచ్చినప్పుడు విశాఖలోని నేవీ అతిథి గృహంలోనే బస చేస్తుంటారని తెలిపారు. మరి ఎందుకు, ఎవరి కోసం రుషికొండ భవనాలు కట్టినట్టు? అని ప్రశ్నించారు. ఒక వ్యక్తి స్వార్థం కోసమే రుషికొండ ప్యాలెస్ కట్టారని ఆరోపించారు.బాత్ టబ్ కోసం రూ.36 లక్షలు ఖర్చు చేశారని, గజపతి బ్లాక్ లో ఆఫీస్ కాంప్లెక్స్ కట్టారని వివరించారు. వీళ్లకు ఎక్కడ్నించి చూసినా సముద్రం వ్యూ కనిపించాలని, ఆ మేరకే భవనాలు కట్టారని చంద్రబాబు వెల్లడించారు. తన ప్యాలెస్ లన్నింటిలోకి ఇక్కడే అదిరిపోయే లగ్జరీ కనపడాలని కట్టించుకున్న ట్టుందని వ్యాఖ్యానించారు. రుషికొండ భవన సముదాయంలోని కళింగ బ్లాక్ లో 300 మంది పట్టే కాన్ఫరెన్స్ హాల్ కట్టారని తెలిపారు.

వివరాలు 2లో..



## జగన్ కేసుల వ్యవహారం బీజేపీ చేతిలో ఉంది

- జగన్ 11 ఏళ్లుగా బెయిల్ పై బయట ఉన్నారన్న నారాయణ
- కోర్టుకు కూడా వెళ్లడం లేదని వ్యాఖ్యలు
- కేంద్రం దృష్టిసారించాలని సూచన



పెన్ పవర్ డెస్క్:మాజీ సీఎం జగన్ పై సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. జగన్ 11 ఏళ్ల నుంచి బెయిల్ పై బయట ఉన్నారని, కోర్టుకు కూడా వెళ్లడం లేదని తెలిపారు. మాయల పకీర్ ప్రాణం పక్షిలో ఉన్నట్టు... జగన్ కేసుల వ్యవహారం బీజేపీ చేతిలో ఉందని అన్నారు. జగన్ పై కేసుల వ్యవహారం ఇప్పటికీ ఓ కొలిక్కి రాలేదని, అంతలోనే జగన్-షర్మిల ఆస్తుల రగడ తెరపైకి వచ్చిందని తెలిపారు. జగన్ కేసుల వ్యవహారంపై కేంద్రం దృష్టిసారించాలని,

వివరాలు 2లో..

## ఉగ్రవాదులను ప్రాణాలతో పట్టుకోండి..

### ఫరూక్ అబ్దుల్లా వ్యాఖ్యలపై దుమారం



పెన్ పవర్ డెస్క్:నేషనల్ కాన్ఫరెన్స్ పార్టీ అధ్యక్షుడు, జమ్ము కశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి ఫరూక్ అబ్దుల్లా వివాదంలో చిక్కుకున్నారు. ఉగ్ర వాదుల గురించి ఆయన చేసిన వ్యాఖ్యలే ఇందుకు కారణం. ఉగ్రవాదులను అంతమొందించడానికి బదులుగా ప్రాణాలతో పట్టుకోవాలని ఆయన సూచించడం పెను దుమారం

వివరాలు 2లో..

## మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్‌పై వాసిరెడ్డి పద్మ పోలీసులకు ఫిర్యాదు...



- అత్యాచార బాధితుల పేర్లను మాధవ్ వెల్లడిస్తున్నారంటూ గోరంట్ల మాధవ్‌పై ఫిర్యాదు
- విజయవాడ సీపీ రాజశేఖర్‌బాబుకు ఫిర్యాదు చేసిన వాసిరెడ్డి పద్మ
- రాజకీయాల్లో కొనసాగడంపై తన నిర్ణయాన్ని వారంలోగా వెల్లడిస్తానని వ్యాఖ్య

వివరాలు 2లో..

## మెగాస్టార్ చిరంజీవిని కలిసిన కేంద్రమంత్రి కిషన్ రెడ్డి...


- చిరంజీవి నివాసానికి విచ్చేసిన కిషన్ రెడ్డి
- మిత్రుడికి సాదర స్వాగతం పలికిన చిరంజీవి
- పరస్పరం దీపావళి శుభాకాంక్షలు తెలుపుకున్న చిరంజీవి, కిషన్ రెడ్డి



పెన్ పవర్ డెస్క్:టాలీవుడ్ మెగాస్టార్ చిరంజీవి, కేంద్రమంత్రి కిషన్ రెడ్డి మంచి మిత్రులన్న సంగతి తెలిసిందే. తాజాగా, కిషన్ రెడ్డి హైదరాబా దులో చిరంజీవి నివాసానికి వెళ్లారు. ఇరువురు పరస్పరం దీపావళి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. తన నివాసానికి వచ్చిన సందర్భంగా కిషన్ రెడ్డికి పుష్పగుచ్ఛం అందించి చిరంజీవి సాదర స్వాగతం పలికారు. శాలువా కప్పి సత్కరించారు. అనంతరం, మిత్రులిద్దరూ కాసేపు

వివరాలు 2లో..

## మంచి నీళ్ల ముసుగులో సాగునీటి ప్రాజెక్ట్.. ఆగని రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్



పెన్ పవర్ డెస్క్: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నిర్మిస్తోన్న రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్‌కు పర్యావరణ అనుమతులు ఇప్పటికీ రాలేదు. అయినా ఏపీ సర్కార్ మాత్రం ప్రాజెక్టు నిర్మాణాన్ని స్పీడప్ చేసింది. కేవలం డ్రింకింగ్ వాటర్ కోసమే ప్రాజెక్టును చేపడుతున్నామని చెప్తున్నది. అందుకు అనుగుణంగా గతేడాది ఆగస్టు 11న జీవో 364 జారీ చేసింది.

వివరాలు 2లో..

## కులగణనతో బీసీల్లో పెనుమార్పులు



పెన్ పవర్ డెస్క్: కులగణనతో బీసీల్లో పెనుమార్పులు రాబోతున్నాయని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. కరీంనగర్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీ, హైకోర్టు ఉత్తర్వుల మేరకే కులగణన చేస్తున్నామని చెప్పారు. స్థానిక సంస్థలు, ఇతర రంగాల రిజర్వేషన్లపై ఆలోచన చేస్తున్నామని, డిసెంబర్‌లో

వివరాలు 2లో..

## నా ఫీజు 100 కోట్ల రూపాయలపైనే.. నా దగ్గర డబ్బు లేదనుకోవద్దు

- ఏదైనా రాజకీయ పార్టీ లేదా నాయకుడికి సలహాలిచ్చేందుకు పీకే ఫీజు రూ. 100 కోట్లు
- బీహార్ ఉప ఎన్నికల ప్రచారంలో భాగంగా తన ఫీజును వెల్లడించిన ప్రశాంత్ కిశోర్
- ఇటీవలే జన్ సూరజ్ పేరిట కొత్త పార్టీ పెట్టిన ఎన్నికల వ్యూహకర్త
- నాలుగు చోట్ల తన పార్టీ అభ్యర్థులను నిలబెట్టిన రాజకీయ విశ్లేషకుడు
- బీహార్ ఉప ఎన్నికలు నవంబర్ 13న.. 23న ఫలితాలు



పెన్ పవర్ డెస్క్:మాజీ ఎన్నికల వ్యూహకర్త.. జన్ సూరజ్ పార్టీ అధినేత ప్రశాంత్ కిషోర్ చేసిన వ్యాఖ్యలు సంచలనంగా మారాయి. బీహార్ ఎన్నికల్లో పోటీపై ప్రచారం ముమ్మరం చేశారాయన. రాబోయే బీహార్ ఎన్నికల్లో సత్తా చాటుతానంటూ ఇప్పటికే సవాళ్లు చేసిన ఆయన..

వివరాలు 2లో..

## అయ్యప్ప భక్తులకు ఉచితంగా లైఫ్ ఇన్సూరెన్స్... కేరళ సర్కారు కీలక నిర్ణయం

- అయ్యప్ప దీక్షల సీజన్ ప్రారంభం
- అయ్యప్ప భక్తుడు శబరిమల యాత్రలో మరణిస్తే రూ.5 లక్షలు చెల్లింపు
- మృతదేహాన్ని స్వస్థలానికి తరలించే బాధ్యత తీసుకోనున్న ప్రభుత్వం

వివరాలు 2లో..



పెన్ పవర్ డెస్క్:అయ్యప్ప దీక్షల సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో, కేరళ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. శబరిమల వచ్చే అయ్యప్పస్వాములకు ఉచితంగా జీవిత బీమా సదుపాయం కల్పించాలని నిర్ణయించింది. సీఎం పినరయి విజయన్ అధ్యక్షతన జరిగిన సమీక్ష సమావేశంలో

## “ఒక చేత్తో ఇచ్చి మరో చేత్తో లాక్కోవడం అంటే” ఇదే..

### కూటమి సర్కార్‌పై షర్మిల ఫైర్..



పెన్ పవర్ డెస్క్:3 సిలిండర్లు ఉచితంగా ఇస్తూ పేద కుటుంబాల్లో దీపం పెట్టామని గొప్పలు చెప్పుకుంటున్న కూటమి సర్కార్ విద్యుత్ సర్దుబాటు చార్జీలతో మరోవైపు వాతలు పెడుతోందని ఏపీ పీసీసీ చీఫ్ షర్మిల విమర్శించారు. “ఒక చేత్తో ఇచ్చి మరో చేత్తో లాక్కోవడం అంటే” ఇదే మరి అని ఎద్దేవా చేశారు.ఉచిత సిలిండర్ల పథకం కింద ఏడాదికి ఇచ్చేది రూ.2685 కోట్లని, ప్రజల దగ్గర

వివరాలు 2లో..

## ఎడిటర్ వ్యూ

# ఏడాది ముందే తమిళ సినిమా...

తమిళనాడు ముఖ్యమంత్రి, డీఎంకే అధినేత ఎంకే స్టాలిన్ వారసుడిగా.. ఉదయనిధి స్టాలిన్ డిప్యూటీ సీఎంగా ప్రమోట్ కావడం అధికార పార్టీలో వారసత్వ రాజకీయాలను స్పష్టం చేశాయి. ఇక, తమ తాత, తండ్రిలా డీఎంకే సారథిగా.. పెరియార్ రాజకీయాలకు నిజమైన నీలి వారసుడిని అని నిరూపించుకోడానికి ఉదయనిధి తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. అందులో భాగంగానే, సనాతన ధర్మానికి వ్యతిరేకంగా వ్యాఖ్యలు చేస్తున్నారు.ద్రవిడ ఓటర్ల పునాదిని మరింత బలంగా ఏకీకృతం చేయడానికి కూడా ప్రయత్నిస్తున్నారు. సరిగ్గా ఈ సమయంలోనే.. విజయ్ తన పొలిటికల్ అస్త్రాన్ని ఉదయనిధిపై గురిపెట్టాడు. అవినీతి, వంశపారపర్య రాజకీయాలను పెంచి పోషిస్తున్న డీఎంకే పార్టీనే తమ టివికె పార్టీకి రాజకీయ శత్రువు అని విజయ్ కచ్చితంగా చెప్పాశారు. అయితే, పెరియార్ మూలాల నుండే పుట్టిన మరో పార్టీ, ఏఐఏడీఎంకేపైన మాత్రం మౌనం వహించారు. అధికారంలో లేదనో.. ఇకపై, అధికారంలోకి రాదనో కానీ, విజయ్ దాని ఊసే ఎత్తలేదు. తాను ఎంచుకున్న రాజకీయ ఎత్తుగడలో ప్రత్యర్థి ఉదయనిధే అన్నట్లు మాట్లాడారు.ప్రస్తుతం, ఎడప్పాడి పళనిస్వామి సారథ్యంలో ఉన్న ఏఐఏడీఎంకే బలం చిన్న చిన్నగా సన్నగిల్లుతోంది. జయలలితా మరణం తర్వాత ఆ పార్టీ తమిళనాడులో శక్తిని కోల్పోయింది. ఒకప్పుడు ఎదురులేకుండా వెలిగిన పార్టీ కావడం వల్ల అక్కడక్కడా ఉనికి మిగిలుంది. 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఈ పార్టీకి వచ్చిన ఓట్లు కేవలం 23% శాతం. ఒక విధంగా, ఫర్వాలేదు అనుకునేంత ఓట్లు సంపాదించుకున్నా ప్రస్తుతం ఆ పార్టీ దాదాపు ఖాళీ అవుతున్నట్లే కనిపిస్తుంది. అయితే, ఏఐఏడీఎంకేకు కచ్చితంగా నమ్మకమైన ఓటర్లు ఉన్నారనడంలో సందేహం లేదు. అందుకే, విజయ్ ఆ పార్టీని టచ్ చేయలేదు.ఏఐఏడిఎంకె పార్టీపై దాడి చేయకపోవడం వల్ల చీలిపోయిన ఎఐఎడిఎంకె అనుకూల ఓట్లను.. అలాగే, పెరియార్‌ను వ్యతిరేకిండంతో వచ్చిన మత అనుకూల ఓటర్ల సమూహాలను ఏకతాటిపైకి తీసుకురావడానికి విజయ్ ప్రయత్నించాడు. తమిళనాడు ఓట్ షేర్లను చూస్తే.. డిఎంకె, ఎఐఎడిఎంకెలకు సంబంధం లేకుండా ఉన్న ఓటు బ్యాంక్ 40% ఉంది. దీని కోసం చిన్నచిన్న పార్టీలతో పొత్తు పెట్టుకుంటున్నప్పటికీ క్షేత్ర స్థాయిలో ఈ ఓటర్లను ఏ పార్టీ ఆకర్షించలేకపోతుంది. కాబట్టి, సరికొత్త ఎత్తుగడతో ఈ ఓట్లను విజయ్ ఆకర్షించడానికి ప్రయత్నిస్తున్నట్లు విశ్లేషకులు భావిస్తున్నారు.ఇక, పెరియార్ సిద్ధాంతాలకు అనుకూలమైన డిఎంకెలో? ఎక్కువగా నాస్తికవాదులు, బ్రాహ్మణిజానికి వ్యతిరేకులు ఉన్నారు. అయితే, తమిళనాడులో చెప్పాకోదగ్గ ఓట్ల శాతం ఉన్న మరే ఇతర పార్టీ అలా లేదు. ఒక విధంగా, డిఎంకెలో కూడా బయటకి చెప్పకుండా పెరియార్ సిద్ధాంతాలను వ్యతిరేకించేవారు కూడా లేకపోలేదు. సరిగ్గా, ఈ పరిస్థితినే విజయ్ క్యాష్ చేసుకోడానికి ప్రయత్నిస్తున్నారు. అలాగని విజయ్ పెరియార్‌కు పూర్తి వ్యతిరేకి కాదు. విజయ్ పెరియార్‌ను ఆదర్శంగా తీసుకున్నట్లు తన మొదటి రాజకీయ గర్జన సభ ఎంట్రీ కటౌట్‌లోనే స్పష్టం చేశారు.అయినప్పటికీ, నాస్తికత్వం, బ్రాహ్మణ వ్యతిరేకత నుండి దూరంగా ఉన్నట్లు కూడా విజయ్ సంకేతాలు పంపారు. పార్టీ సిద్ధాంతానికి అనుగుణంగా ఉదయనిధి, మత వ్యతిరేక వ్యాఖ్యలు చేస్తుంటే.. విజయ్ సంఘ సంస్కర్తగా ఉన్న పెరియార్‌ను మాత్రమే స్వీకరిస్తానని చెబుతున్నారు. దీనితో తన రాజకీయాల పరిధిని పెంచుకుంటున్నారు. తమిళ స్టార్ హీరోగా విజయ్‌కి ఉన్న భారీ ఫ్యాన్ ఫాలోయింగ్‌లో ఈ ప్రభావం ఉండకుండా కూడా జాగ్రత్త పడుతున్నారు. అందుకే, ద్రావిడ రాజకీయాల గమనాన్ని నిర్వచించడంలో కొత్త వైఖరిని చూపిస్తున్నాడు.అయితే, ఉదయనిధి తమిళనాడు ఉప ముఖ్యమంత్రి అయిన సమయంలోనే.. తన మొదటి రాజకీయ సినిమాను విజయ్ రిలీజ్ చేశారు. తన సొంత రాజకీయ పార్టీని ప్రకటించి, సంచలనం రేపాడు. రజనీకాంత్, కమల్ హాసన్‌లా కాకుండా.. ఎంజీఆర్, జయలలిత, కరుణానిధి, విజయకాంత్ లాగా.. విజయ్ తమిళ రాజకీయాల్లో ఒక ఒరవడిలా బలమైన పునాదితో వచ్చారు. 'విజయ్‌మక్కల్ ఇయక్కమ్' అనే తన అభిమానుల పార్టీ ఇప్పటికే స్థానిక ఎన్నికల్లో పోటీ చేసి సంచలన విజయం సాధించింది.అందుకే, తమిళనాడు రాజకీయాల్లో విజయ్‌కి డీఎంకే అతిపెద్ద ప్రత్యర్థిగా మారింది. అయితే, అట్టడుగు స్థాయిలో ప్రజలతో మమేకమయ్యేలా ఉదయనిధి స్టాలిన్‌కి అట్టడుగున సంస్థాగత నిర్మాణం ఉంది. కానీ, విజయ్ ఆ స్థాయిలో వ్యవస్థను రూపొందించుకోవడం అంత సులువు కాదు. సినిమా డైలాగులకు ఏ మాత్రం తగ్గని మాస్ స్పీచ్ ఇచ్చినప్పటికీ.. తమిళనాడు నిర్మించుకున్న ద్రవిడ పునాదులపై నిలబడిన జనాన్ని గెలిపించడంలో విజయ్ ఇంతగా రాణించలేదన్నది కొందరు నిపుణులు అంటున్న మాట. విజయ్ పొలిటికల్ డైలాగుల ప్రభావం కన్నా.. విజయ్ వేసిన పొలిటికల్ ప్లాన్ చాలా సమర్థవంతంగా ఉందనడంలో సందేహం లేదు. రాజకీయాల్లోకి అడుగు పెట్టకముందే రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో గ్రౌండ్‌వర్క్‌ను పూర్తి చేసిన 'విజయ్‌మక్కల్ ఇయక్కమ్' బలం కావాల్సినంత కాన్ఫిడెన్స్ ఇచ్చింది. ఇక, తమిళనాడులో సినిమాలకు, రాజకీయాలకు మధ్య విడదీయరాని సంబంధం గట్టిగా పెనవేసుకోని ఉంది. అందుకే, విజయ్ ఇచ్చిన సూచనలు, ప్లాన్ చేసిన నేపథ్యం, ప్రస్తుత ఒరవడి ఈసారి తళపతి విజయ్‌కి సీఎం ట్యాగ్ ఇస్తాయేమో చూడాలి. అయితే, అసెంబ్లీ ఎన్నికలకు మరో ఏడాదికి పైగా సమయం ఉంది కాబట్టి, విజయ్ తన పార్టీని ఎలా రెడీ చేస్తాడన్నది తెలియాలి. ఏది ఏమైనప్పటికీ? తమిళనాడులో మరోసారి ఇద్దరి కథానాయకులతో నడిచే మాస్ మ్యాట్నీ షో తప్పదు.

# నేను చాలా దేశాలు తిరిగాను కానీ ఇంత లగ్జరీ చూడలేదు

- మొదటి పేజీ తరువాయి

"రాజులు కూడా ఇలాంటి ఆఫీసులు కట్టుకుంటారని నేను అనుకోవడంలేదు... వాళ్లకు ఇన్ని తెలివితేటలు లేవు. ఆ కారిడార్ చూస్తుంటే అమెరికా వైట్ హౌస్ లో కూడా అలాంటిది ఉండదేమో అనిపించింది. మన రాష్ట్రపతి భవన్ లోనూ లేదు... రాష్ట్రపతి భవన్ లో ఉన్నది చిన్న కారిడారే... మేం ఢిల్లీ వెళ్లినప్పుడు చూస్తుంటాం... నాడు బ్రిటీష్ వాళ్లు ప్లాన్ చేశారు కానీ, అది చాలా చిన్న కారిడార్.

వాళ్ల పీఏలకు కూడా రూములు కట్టుకున్నారు, పెద్ద కాన్ఫరెన్స్ హాల్ పక్కనే చిన్న కాన్ఫరెన్స్ హాళ్లు కట్టుకున్నారు. ఇప్పుడు గుండె చెదిరిపోయే వాస్తవాలు బయటికి వస్తున్నాయి... ఏకంగా 100 కేవీ సబ్ స్టేషన్, 200 టన్నుల సెంట్రల్ ఏసీ ఏర్పాటు చేశారు. గతంలో షాండ్లియర్లు చూశాం... ఇక్కడ ఫ్యాన్సీ ఫ్యాన్లు ఏర్పాటు చేశారు. ఇక్కడ పనిచేసే సిబ్బంది, సర్వెంట్ల కోసం ఒక పెద్ద బ్లాక్ కట్టారు. ఇలాంటివి కలలో కూడా ఊహించలేం. నాకు

చాలా ఆశ్చర్యం వేస్తోంది. నేను చాలా దేశాలు తిరిగాను కానీ, ఈ దొంగలకు ఇంత ఇన్నోవేషన్ ఎలా వచ్చిందో అర్థం కావడంలేదు. మంచి నీళ్ల మాదిరిగా డబ్బులు ఖర్చు పెట్టారు. అవి వాళ్ల సొంత డబ్బులు కాదు. అన్ని నిబంధనలను ఉల్లంఘించారు. హైకోర్టును, ఎన్జీటీని, కేంద్ర ప్రభుత్వాన్ని కూడా మభ్యపెట్టారు. అధికారులను కూడా మభ్యపెట్టారు. ఇప్పుడవన్నీ కరెక్టుగా విచారణ జరిగితే ఎంతోమంది ఎగిరిపోతారు. ఇతడు ఒక దుర్మార్గుడు, ఒక కరడుగట్టిన నేరస్తుడు... అందుకే నేను అనేది ఎస్కోబార్ అని. ఇలాంటి వాళ్లు రాజకీయాల్లో ఉండాలా అనేదానిపై చర్చ జరగాలి. పేదలకు, పెత్తందార్లకు మధ్య యుద్ధం అంటాడు... పేదల పేరు చెప్పి ఇలాంటి విలాసవంతమైన భవనాలు కట్టుకుంటాడు. మనం చేసే పని తప్పా, ఒప్పా అనేది మనస్సాక్షి చెబుతుంది... అలాంటిది మనస్సాక్షిని కూడా లెక్కచేయని పరిస్థితికి వచ్చాడు" అంటూ చంద్రబాబు ధ్వజమెత్తారు.

# మెగాస్టార్ చిరంజీవిని కలిసిన కేంద్రమంత్రి కిషన్ రెడ్డి...

- మొదటి పేజీ తరువాయి

ముచ్చటించుకున్నారు. చిరంజీవి గతంలో యూపీఏ ప్రభుత్వంలో టూరిజం శాఖ మంత్రిగా వ్యవహరించిన సంగతి తెలిసిందే. కిషన్ రెడ్డి కూడా గత టర్మ్ లో టూరిజం శాఖ మంత్రిగా పనిచేశారు. ఈ ఏడాది చిరంజీవిని కేంద్రం పద్మవిభూషణ్ పురస్కారంతో గౌరవించగా... చిరంజీవిని కిషన్ రెడ్డి స్పెషల్ గా ఇంటర్వ్యూ చేశారు. ఈ ఇంటర్వ్యూ వ్యూస్ పరంగా దూసుకుపోయింది.

కాగా, నేడు చిరంజీవితో భేటీపై కిషన్ రెడ్డి సోషల్ మీడియాలో స్పందించారు. చిరంజీవి మంచి మనిషి అని కొనియాడారు. ఆయనను ఎప్పుడు కలిసినా సంతోషంగా ఉంటుందని తెలిపారు. సినీ రంగానికి అందిస్తున్న సేవలు, దాతృత్వ కార్యక్రమాలతో కోట్లాది మందికి చిరంజీవి స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నారని వివరించారు.

# మంచి నీళ్ల ముసుగులో సాగునీటి ప్రాజెక్ట్.. ఆగని రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్

- మొదటి పేజీ తరువాయి

ప్రాజెక్టును ఫేజ్ 1, ఫేజ్ 2 కింద విభజించామని. ప్రస్తుతం ఫేజ్ 1 పనులు డ్రింకింగ్ వాటర్ కోసమే చేస్తున్నామని వాదిస్తున్నది. కానీ వాస్తవ పరిస్థితులు మాత్రం ఇందుకు భిన్నంగా ఉన్నాయి. డ్రింకింగ్ వాటర్ ముసుగులో ఫేజ్ 1 పనులను చేస్తున్న ఏపీ.. పనిలోపనిగా ఇరిగేషన్ అవసరాలను తీర్చే ఫేజ్ 2 పనులనూ మొదలు పెట్టేసింది.

ఇప్పటికే ప్రాజెక్టులో భాగమైన పంప్ హౌస్ నిర్మాణ పనులు 87 శాతం పూర్తి చేసింది. నీటిని తరలించే స్థానం నుంచి పంప్ హౌస్ వరకు అప్రోచ్ చానెల్ పనులనూ 14.13 శాతం పూర్తి చేసింది. అప్రోచ్ చానెల్లో 4.59 కోట్ల క్యూబిక్ మీటర్ల వర్త్ వర్క్ పనులను చేయాల్సి ఉండగా, 64.97 లక్షల క్యూబిక్ మీటర్ల పని కంప్లీట్ చేసింది. పంప్ హౌస్ కు మొత్తం 27 లక్షల క్యూబిక్ మీటర్ల పని చేయాల్సి ఉండగా, 23.49 లక్షల క్యూబిక్ మీటర్ల పని పూర్తి చేసేసింది. మరో 3.50 లక్షల క్యూబిక్ మీటర్ల పని మాత్రమే పెండింగ్లో ఉంది.

# "ఒక చేత్తో ఇచ్చి మరో చేత్తో లాక్కోవడం అంటే" ఇదే..

- మొదటి పేజీ తరువాయి

నుంచి కరెంటు బిల్లుల రూపంలో ముక్కుపిండి అదనంగా వసూలు చేసేది రూ.6 వేల కోట్లని ఆమె ఆరోపించారు. ఇంకా రూ.3 వేల కోట్లు ప్రజల పైనే అదనపు భారం పడుతుందని వివరించారు. దీపం కింద వెలుగులు పక్కన పెడితే, కరెంటు బిల్లుల రూపంలో కుటుంబాల్లో కూటమి ప్రభుత్వం కారు చీకట్లు నింపుతుందని షర్మిల మండిపడ్డారు. గత వైసీపీ చేసిన పాపమే ఇదని, ఈ ప్రభుత్వానికి సంబంధం లేదని, బిల్లుల వసూళ్లకు అనుమతి ఇచ్చింది %ూ్రాజు=జ% తప్ప.. తాము కాదని చెప్తున్నవి కుంటి సాకులు తప్ప మరొకటి కాదని ఆమె చెప్పారు. వైసీపీ ప్రభుత్వం 5 ఏళ్ల పాలనలో 9 సార్లు చార్జీలు పెంచితే, కూటమి సర్కార్ కూడా మొదలుపెట్టిందని.. వైసీపీ పాలనకు, కూటమి పాలనకు తేడా ఏముందని షర్మిల నిలదీశారు. రూ.6 వేల కోట్ల భారం ప్రజలపై మోపడం భావ్యం కాదని, బీజేపీకి మద్దతు ఇస్తున్నారు కదా.. సాయం తీసుకురండని టీడీపీ, జనసేన పార్టీలకు షర్మిల సూచన చేశారు. ప్రభుత్వమే ఈ భారం మోయాలని డిమాండ్ చేస్తున్నామని, ప్రజలపై సర్దుబాటు చార్జీల భారాన్ని మోపినందుకు నిరసనగా కాంగ్రెస్ పార్టీ ఈ నెల 5న రాష్ట్ర వ్యాప్త ఆందోళనలకు పిలుపునిచ్చినట్లు ఏపీ పీసీసీ చీఫ్ షర్మిల తెలిపారు.

# ఉగ్రవాదులను ప్రాణాలతో పట్టుకోండి..

- మొదటి పేజీ తరువాయి

రేపింది. ఉగ్రవా దులను ప్రాణాలతో పట్టుకుంటే బుద్గామ్‌లో జరిగిన కాల్పుల వెనుక ఉన్న మాస్టర్ మైండ్‌ను కనిపెట్టొచ్చని ఆయన సూచించారు. జమ్మూ కశ్మీర్ ప్రభుత్వాన్ని అస్థిరపరిచే కుట్రలో భాగంగా ఈ ఉగ్ర కాల్పులు జరిగాయేమోనని అనుమానంగా ఉందని ఆయన సందేహం వ్యక్తం చేశారు.

వలస కార్మికులపై జరిగిన ఈ కాల్పుల ఘటనపై విచారణ జరపాలని, టెర్రరిస్టులను ప్రాణాలతో పట్టుకుంటే ఈ ఉగ్రదాడుల వెనుక ఎవరున్నారో విచారణ జరిపి తెలుసుకోవచ్చని ఆయన చెప్పుకొచ్చారు. ఒమర్ అబ్దుల్లా ప్రభుత్వాన్ని అస్థిరపరిచేందుకు ఏదైనా ఏజెన్సీ ఈ కుయుక్తులకు పాల్పడుతుందేమోననే కోణంలో తామూ విచారణ చేస్తామని ఫరూక్ అబ్దుల్లా తెలిపారు. జమ్ము కశ్మీర్ లోని బుద్గామ్ జిల్లాలో యూపీకి చెందిన ఇద్దరు వలస కార్మికులు ఉగ్రవాదుల కాల్పుల్లో మృతి చెందిన సంగతి తెలిసిందే. కశ్మీర్ వ్యాలీలో అమాయకులైన వలస కార్మికులపై గత రెండు వారాల్లో నాలుగు సార్లు ఉగ్రవాదులు కాల్పులు జరిపారు. జమ్మూకాశ్మీర్‌లోని గందర్ బాల్ జిల్లా గగాంగిర్ వద్ద టెర్రరిస్టులు జరిపిన కాల్పుల్లో ఏడుగురు చనిపోయిన ఘటన ఉగ్రమూకల దుశ్చర్యకు అద్దం పట్టింది.

మృతుల్లో ఒక డాక్టర్, ఐదుగురు వలస కార్మికులు ఉన్నారు. గుండ్ ప్రాంతంలో సొరంగాన్ని నిర్మించే పనిలో కార్మికులు ఉండగా టెర్రరిస్టులు కాల్పులు జరిపారు. ఈ అటాక్‌లో ఇద్దరు స్పాట్‌లోనే చనిపోగా, మరో ఐదుగురు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరణించారు.

# మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్‌పై వాసిరెడ్డి పద్మ పోలీసులకు ఫిర్యాదు...

**పెన్ పవర్ డెస్క్:** ఇటీవల వైసీపీ పార్టీని వీడిన ఏపీ మహిళా కమిషన్ మాజీ ఛైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మ... మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్‌పై పోలీసులకు ఫిర్యాదు చేశారు. అత్యాచార బాధితుల పేర్లను మాధవ్ వెల్లడిస్తున్నారని విజయవాడ సీపీ రాజశేఖర్‌బాబుకు ఇచ్చిన తన ఫిర్యాదులో పేర్కొన్నారు. అఘాయిత్యానికి గురైన వారి పేర్లను బయటకు చెప్పడం దుర్మార్గమని, వైసీపీ మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్‌పై చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు. ఇక తాను రాజకీయాల్లో కొనసాగడంపై తన నిర్ణయాన్ని వారంలోగా వెల్లడిస్తానని వాసిరెడ్డి పద్మ అన్నారు.

# జగన్ కేసుల వ్యవహారం బీజేపీ చేతిలో ఉంది

- మొదటి పేజీ తరువాయి

తద్వారా అన్నాచెల్లెళ్ల ఆస్తుల పంచాయితీ కూడా తేలిపోతుందని పేర్కొన్నారు. ఇక, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలను ప్రధాని మోదీ విమర్శించడం సిగ్గుచేటని నారాయణ వ్యాఖ్యానించారు. సమాఖ్య వ్యవస్థకు విరుద్ధంగా మోదీ వ్యవహార శైలి ఉందని నారాయణ విమర్శించారు. అధికారం కోసం ఉత్తరాది, దక్షిణాది అని బీజేపీ ప్రచారం చేస్తోందని మండిపడ్డారు.

ప్రాంతీయ పార్టీలు బలపడుతున్నాయని, జాతీయ పార్టీలు బలహీనపడుతున్నాయని వ్యాఖ్యానించారు. సీపీఐ జాతీయ స్థాయిలో బలోపేతం కావడానికి తగిన ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్టు చెప్పారు.

# కులగణనతో బీసీల్లో పెనుమార్పులు

- మొదటి పేజీ తరువాయి

సర్వే నివేదికను ప్రభుత్వం ముందు ఉంచుతామని తెలిపారు. కులగణనపై ప్రతిపక్షాలు రాద్ధాంతం చేస్తున్నాయని విమర్శించారు. బీసీ కమిషన్ ఏర్పాటును హైకోర్టు తప్పుబట్టలేదని.. డెడికేషన్ కమిటీ వేయాలని చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు సకల జనుల సర్వేను చేపట్టి కనీసం రిపోర్టును కూడా బయటపెట్టలేదని ఎద్దేవా చేశారు.హైకోర్టు ఉత్తర్వుల మేరకు రాష్ట్రంలో కులగణన జరుగుతోందని స్పష్టం చేశారు. సర్వే విషయంలో ఎవరికీ ఎలాంటి అనుమానాలు, అయోమయం అక్కర్లేదని అన్నారు. అందరూ సర్వేకు సహకరించాలని పొన్నం పిలుపునిచ్చారు.

# అయ్యప్ప భక్తులకు ఉచితంగా లైఫ్ ఇన్సూరెన్స్... కేరళ సర్కారు కీలక నిర్ణయం

- మొదటి పేజీ తరువాయి

ఈ కీలక అంశంపై చర్చించారు. అయ్యప్ప దీక్షలో ఉన్న స్వాములు శబరిమల యాత్ర సందర్భంగా మరణిస్తే, వారి కుటుంబానికి రూ.5 లక్షలు అందించనున్నారు. అంతేకాదు, ఆ భక్తుడి మృతదేహాన్ని స్వస్థలానికి తరలించడానికి ప్రభుత్వమే ఏర్పాట్లు చేస్తుంది. అయ్యప్ప ఆలయంతో పాటు కేరళలోని దక్షిణ ప్రాంతంలోని అన్ని ఆలయాలను పర్యవేక్షించే ట్రావెన్ కూర్ దేవస్వోమ్ బోర్డు ఈ సరికొత్త బీమా పథకానికి ప్రీమియం చెల్లిస్తుంది. కాగా, రెండు నెలలకు పైగా కొనసాగే అయ్యప్ప స్వాముల దీక్షల నేపథ్యంలో... శబరిమల ఆలయం నవంబరు 16న తెరుచుకోనుంది.

# నా ఫీజు 100 కోట్ల రూపాయలపైనే.. నా దగ్గర డబ్బు లేదనుకోవద్దు

- మొదటి పేజీ తరువాయి

ఓ సభలో చేసిన వ్యాఖ్యలు సంచలనంగా మారాయి.జన్ సూరజ్ పార్టీకి నిధులు ఎక్కడి నుంచి వస్తున్నాయి.. ఎలా ఖర్చు పెడుతున్నారు అంటూ కొంత మంది విమర్శలు చేస్తున్నారు.. వాళ్లకు ఇదే నా సమాధానం అంటూ అసలు విషయాన్ని బయటపెట్టారు ప్రశాంత్ కిషోర్..

నేను ఎన్నికల వ్యూహకర్తగా ఒక్క డీల్ కు కనీసం 100 కోట్ల రూపాయలు తక్కువ కాకుండా తీసుకుంటాను.. నా వ్యూహాలతో దేశంలో 10 రాష్ట్ర ప్రభుత్వాలు నడుస్తున్నాయి.. నా దగ్గర డబ్బులు లేవనుకోవద్దు.. వందల కోట్లు ఉన్నాయంటూ అసలు విషయాన్ని బయటపెట్టారు. బీహార్ రాజకీయాల్లో రాబోయే ఎన్నికలకే కాదు.. ఆ తర్వాత ఎన్నికల వరకు ఖర్చు పెట్టటానికి.. పార్టీని నడిపించటానికి నా దగ్గర డబ్బులు ఉన్నాయంటూ చెప్పుకొచ్చారు ప్రశాంత్ కిషోర్..ప్రశాంత్ కిషోర్ 2014లో బీజేపీ ఆధ్వర్యంలోని మోదీకి పని చేశారు.. 2015లో బీహార్ లో జనతాదళ్ పార్టీకి పని చేశారు.. 2017లో యూపీలోని కాంగ్రెస్ పార్టీకి వ్యూహకర్తగా వ్యవహరించారు. 2019లో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి.. 2021లో పశ్చిమ బెంగాల్ లోని తృణమూల్ కాంగ్రెస్ పార్టీకి.. ఆ తర్వాత తమిళనాడులోని డీఎంకే పార్టీకి.. 2020లో ఆమ్ ఆద్మీ పార్టీకి ఎన్నికల వ్యూహకర్తగా పని చేశారు.ఒక్కో పార్టీ దగ్గర కనీసంలో కనీసం 100 కోట్ల రూపాయలు తీసుకున్నా.. ఇప్పటికే ప్రశాంత్ కిషోర్ దగ్గర వేల కోట్ల డబ్బు ఉందని.. ఆయన పరోక్షంగానే చెప్పుకొచ్చారు.బీహార్ రాష్ట్రంలో త్వరలో నాలుగు అసెంబ్లీ నియోజకర్గాల్లో ఉప ఎన్నికలు జరగబోతున్నాయి. బెలగంజ్, ఇమామ్ గంజ్, రాంగఢ్, తరారీ స్థానాల్లో జన సూరజ్ పార్టీ తరపున బలమైన అభ్యర్థులను బరిలోకి దించబోతున్నట్లు కూడా స్పష్టం చేశారు ప్రశాంత్ కిషోర్. ఎన్నికలు కొత్త కాదు.. ఎన్నికలు ఎలా నడుస్తాయో కూడా ప్రశాంత్ కిషోర్ కు బాగా తెలుసు.. అలాంటాయన డబ్బు లేకుండా రాజకీయాలు ఎలా చేస్తారని అనుకున్నారో ఏమో..

# ట్రబుల్స్ షూట్స్ చేయలేక... ఒంటరిగా....

**కడప, నవంబర్ 2, పెన్ పవర్:** వైసీపీ అధినేత వైఎస్ జగన్ పక్కా బిజినెస్ మ్యాన్. అంత వరకే. ఆయన రాజకీయాలు డీల్ చేయడంలో ఎంత వీక్ అనేది మొన్నటి ఎన్నికల్లోనే అర్థమయింది. ఇక ఫ్యామిలీని డీల్ చేయడంలోనూ అదే బలహీనత ఉందని కూడా నిన్నటితో పూర్తిగా స్పష్టమయింది. కన్న తల్లి జగన్ కు అడ్డం తిరగడంతోనే అర్థమయింది. ఇటు రాజకీయంగా సరైన నిర్ణయాలు తీసుకోలేక అధికారాన్ని మళ్లీ చేజిక్కించుకోలేదు. అలాగే ఆయన కుటుంబాన్ని కూడా సరిగా డీల్ చేయలేక నలుగురిలో నవ్వుల పాలవుతున్నారు. ఆస్తుల వివాదం ఆయన ఇమేజ్ ను చాలా వరకూ డ్యామేజీ చేసిందనే చెప్పాలి. దానిని ఇంత వరకూ ఏ రాజకీయ నేత అయినా.. అందులోనూ ముఖ్యమంత్రిగా మరోసారి బాధ్యతలను తీసుకోవాలని అనుకుంటున్న వారు చేయడం ఎంత వరకూ సబబన్న ప్రశ్నలు సహజంగానే తలెత్తుతున్నాయి. తల్లి విజయమ్మ కూడా జగన్ పక్షాన నిలవలేదంటే తప్పు జగన్ వైపు ఉందనడంలో ఎలాంటి సందేహం లేదు.ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును చూసైనా రాజకీయాల్లో, కుటుంబ పరంగా ఎలా డీల్ చేయాలో తెలుసుకోలేకపోతే ఎలా? అని వైసీపీ సీనియర్ నేతలే ప్రశ్నిస్తున్నారు. మన కళ్ల ఎదుటే చంద్రబాబు కుటుంబంలో ఉన్న ఎన్ని సమస్యలు తలెత్తినా ఎంత జాగ్రత్తగా డీల్ చేయగలిగారో ప్రతి ఒక్కరికీ తెలుసు. ఎన్టీఆర్ నుంచి ముఖ్యమంత్రి పదవిని తీసుకున్నటప్పుడు కూడా నందమూరి కుటుంబాన్ని మొత్తాన్ని ఒక తాటిపైకి తీసుకురాగలిగారు. పార్టీని తన చేతుల్లోకి తీసుకోవడంలో చంద్రబాబుకు దగ్గరుండి సహకరించింది నందమూరి, దగ్గుబాటి కుటుంబాలే. ఇక ఆ తర్వాత ఆయనకు రాజకీయంగా తిరుగులేదు. మరోవైపు తన వారసుడు లోకేష్ తో నందమూరి బాలకృష్ణ కుమార్తెతో వివాహం చేసి మరీ గట్టి పర్చేశారు. ఇక ధోకా లేకుండా తనకు, రాజకీయాల్లో, ఆస్తుల విషయంలో తిరుగులేకుండా చేసుకోగలిగారు.కానీ జగన్ విషయంలో ఏమైంది. అన్నింటికీ పూర్తి విరుద్ధం. ఒకసారి ముఖ్యమంత్రి అయిన



తర్వాత తాడేపల్లి క్యాంప్ కార్యాలయం గడప దాటకుండా గడిపేశారు. కార్యకర్తలను దూరం చేసుకున్నారు. వైసీపీ నేతలు, ఎమ్మెల్యేలకు పూర్తి స్థాయి అధికారాలు ఇవ్వకుండా నియంతలా వ్యవహరించారు. కేవలం సంక్షేమ పథకాలను నమ్ముకుని నట్టేట మునిగారు. ఎమ్మెల్యేలను, మంత్రులను నియోజకవర్గాలను మార్చి భంగపడ్డారు. ఎన్నికల్లో హామీలు ఇవ్వకుండా అధికారాన్ని చేజేతులా కోల్పోయారు. పింఛను కూడా పెంచనని చెప్పి ఓట్లను తనకు కాకుండా చేసుకున్నారు. ఎలాంటి హామీలు ఇవ్వకుండా కేవలం తన బటన్ నొక్కడమే తనకు మరోసారి విజయం తెచ్చిపెడుతుందని గుడ్డిగా నమ్మారు. అదే చివరకు కొంపముంచింది. ఇప్పటికీ మద్యం, ఇసుక విషయాల్లో తన స్టాండ్ మార్చుకోలేదంటే మూర్ఖత్వమని భావించాలా? డీల్ చేయడం తెలియదని అనుకోవాలా? అనేది వైసీపీ నేతలకే తెలియడం లేదు.ఇక కుటుంబంలో సమస్యను సీరియస్ గా తీసుకోవాల్సిన జగన్ లైట్ గా తీసుకున్నారు. తన చెల్లెలు వైఎస్ షర్మిలను దూరం చేసుకున్నారు. రాహుల్ గాంధీని చూశారుగా.. తన సోదరి ప్రియాంకకు వాయనాడ్ స్థానంలో అభ్యర్థిగా ప్రకటించారు. చంద్రబాబు బాలకృష్ణను ఎమ్మెల్యేగా చేశారు. తన తండ్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి కూడా తన సోదరుడు నాడు వైఎస్ వివేకానందరెడ్డిని ఎంపీగా, ఎమ్మెల్యేగా చేశారు. ఇన్నీ తెలిసినా షర్మిలను దూరం పెట్టారు. చివరకు ఆస్తుల వివాదాన్ని కూడా కొని తెచ్చుకున్నారు. కనీసం ఆస్తుల వివాదాన్ని అయినా పట్టుకుని లాగకుండా.. పట్టు విడుపులు ప్రదర్శించి ఉంటే కొంత వరకూ రాజకీయంగా ఇబ్బంది ఉండేది కాదు. ఇప్పుడు తనంతట తానే ప్రత్యర్థులకు అవకాశం ఇచ్చినట్లయింది. అంటే ఎంతమందిని చూసైనా జగన్ నేర్చుకోరా? జగన్ కు తెలియదని కాదు. తెలిసీ తప్పటడుగులు వేస్తున్నారంటే.. డీల్ చేయడం రాదని అనుకోవాలా? లేక నేనింతేనంటూ మొండితనంతో ముందుకు వెళ్లాలనుకుంటున్నారా? అన్నది మాత్రం ఆయనకే తెలియాలి. జగన్ ను ఆ దేవుడే రాజకీయంగా కాపాడాలి అంటున్నారు వైసీపీ నేతలు. జగన్ ఇప్పుడు కుటుంబంలోనూ ఒంటరి వాడయ్యాడు.

# 23వేల కోట్లకు చేరిన అప్పు

**విజయవాడ, నవంబర్ 2, పెన్ పవర్:** రాష్ట్ర ప్రభుత్వం నిధులను సమకూర్చే ప్రక్రియలో భాగంగా.. అప్పు కోసం ఆస్తులను ఇండెంట్ పెడుతుంది. ప్రభుత్వానికి చెందిన సెక్యూరిటీ బాండ్లను కూటమి ప్రభుత్వం వేలానికి పెట్టింది. ఇప్పటివరకు ఆరుసార్లు రూ. 20,000 కోట్ల అప్పు కోసం సెక్యూరిటీ బాండ్లను వేలానికి పెట్టింది. తాజాగా ఈనెల 29న నిర్వహించిన సెక్యూరిటీస్ వేలంలో మరో రూ. 3,000 కోట్ల అప్పు కోసం ఇండెంట్ పెట్టింది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కోర్ బ్యాంకింగ్ సొల్యూషన్ (ఈ-కుబేర్) వేలం వేసింది. కాంపిటీటివ్, నాన్ కాంపిటీటివ్ బిడ్స్ రూపంలో ఆర్‌బీఐ వాటిని విక్రయించింది.



**జూన్ 11న రూ.2,000 కోట్లు..**

కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే జూన్ 11న నిర్వహించిన స్టేట్ గవర్నమెంట్ సెక్యూరిటీస్ వేలంలో.. రూ. 2,000 కోట్ల (రూ.500 కోట్లు, రూ.500 కోట్లు, రూ.1,000 కోట్లు) అప్పు కోసం ప్రభుత్వం ఇండెంట్ పెట్టింది. ఇందులో రూ.500 కోట్ల విలువ చేసే రెండు సెక్యూరిటీ బాండ్ల, రూ.1,000 కోట్ల విలువ చేసే ఒక సెక్యూరిటీ బాండ్ రాష్ట్ర ప్రభుత్వం వేలానికి పెట్టింది. మొదటి రూ.500 కోట్ల బాండు 15 ఏళ్లు, రెండో రూ.500 కోట్ల బాండు 19 ఏళ్లు, రూ.1,000 కోట్ల బాండ్ 21 ఏళ్ల కాల పరిమితి ఉంటుంది.

**జూన్ 25న రూ.2,000 కోట్లు..**

జూన్ 25న నిర్వహించిన స్టేట్ గవర్నమెంట్ సెక్యూరిటీస్ వేలంలో.. రూ. 2,000 కోట్ల (ఒక్కొక్కటి రూ.1,000 కోట్లు చొప్పున రెండు బాండ్లు) అప్పు కోసం రాష్ట్ర ప్రభుత్వం ఇండెంట్ పెట్టింది. ఇందులో రూ.1,000 కోట్ల విలువ చేసే రెండు సెక్యూరిటీ బాండ్లను వేలానికి పెట్టింది. మొదటి రూ.1,000 కోట్ల బాండు 11 ఏళ్లు, రెండో రూ.1,000 కోట్ల బాండు 20 ఏళ్ల కాల పరిమితి ఉంటుంది.

**జులై 2న రూ.5,000 కోట్లు..**

జులై 2న నిర్వహించిన స్టేట్ గవర్నమెంట్ సెక్యూరిటీస్ వేలంలో.. రూ. 5,000 కోట్ల (ఒక్కొక్కటి రూ.1,000 కోట్లు చొప్పున ఐదు బాండ్లు) అప్పు కోసం ప్రభుత్వం ఇండెంట్ పెట్టింది. ఇందులో రూ.1,000 కోట్ల విలువ చేసే ఐదు సెక్యూరిటీ బాండ్లను రాష్ట్ర ప్రభుత్వం వేలానికి పెట్టింది. మొదటి రూ.1,000 కోట్ల బాండు 9 ఏళ్లు, రెండో రూ.1,000 కోట్ల బాండు 12 ఏళ్లు, మూడు రూ.1,000 కోట్ల బాండు17 ఏళ్లు, నాలుగో రూ.1,000 కోట్ల బాండు 21 ఏళ్లు, ఐదో రూ.1,000 కోట్ల బాండు 24 ఏళ్ల కాల పరిమితి ఉంటుంది.

**జులై 16న రూ.2,000 కోట్లు..**

జులై 16న నిర్వహించిన స్టేట్ గవర్నమెంట్ సెక్యూరిటీస్ వేలంలో రూ. 2,000 కోట్ల (ఒక్కొక్కటి రూ.1,000 కోట్లు చొప్పున రెండు బాండ్లు) అప్పునకు ఇండెంట్ పెట్టింది. ఇందులో రూ.1,000 కోట్ల విలువ చేసే రెండు సెక్యూరిటీ బాండ్లను రాష్ట్ర ప్రభుత్వం వేలానికి పెట్టింది. మొదటి రూ.1,000 కోట్ల బాండు 16 ఏళ్లు, రెండో రూ.1,000 కోట్ల బాండు 19 ఏళ్ల కాల పరిమితి ఉంటుంది.

**జులై 30న రూ. 3,000 కోట్లు..**

జులై 30న నిర్వహించిన స్టేట్ గవర్నమెంట్ సెక్యూరిటీస్ వేలంలో.. రూ. 3,000 కోట్ల (ఒక్కొక్కటి రూ.1,000 కోట్లు చొప్పున మూడు బాండ్లు) అప్పు కోసం రాష్ట్ర ప్రభుత్వం ఇండెంట్ పెట్టింది. ఇందులో రూ.1,000 కోట్ల విలువ చేసే మూడు సెక్యూరిటీ బాండ్లను వేలానికి పెట్టింది. మొదటి రూ.1,000 కోట్ల బాండు 15 ఏళ్లు, రెండో రూ.1,000 కోట్ల బాండు 20 ఏళ్లు, మూడో రూ.1,000 కోట్ల బాండు 25 ఏళ్ల కాల పరిమితి ఉంటుంది.

**ఆగస్టు 27న రూ. 3,000 కోట్లు..**

ఆగస్టు 27న నిర్వహించిన స్టేట్ గవర్నమెంట్ సెక్యూరిటీస్ వేలంలో.. రూ. 3,000 కోట్ల (ఒక్కొక్కటి రూ.1,000 కోట్లు చొప్పున మూడు బాండ్లు) అప్పునకు ప్రభుత్వం ఇండెంట్ పెట్టింది. ఇందులో రూ.1,000 కోట్ల విలువ చేసే మూడు సెక్యూరిటీ బాండ్లను వేలానికి పెట్టింది. మొదటి రూ.1,000 కోట్ల బాండు 12 ఏళ్లు, రెండో రూ.1,000 కోట్ల బాండు 17 ఏళ్లు, మూడో రూ.1,000 కోట్ల బాండు 22 ఏళ్ల కాల పరిమితి ఉంటుంది.

**అక్టోబర్ 1న రూ.3,000 కోట్లు..**

అక్టోబర్ 1న నిర్వహించిన స్టేట్ గవర్నమెంట్ సెక్యూరిటీస్ వేలంలో.. రూ. 3,000 కోట్ల (ఒక్కొక్కటి రూ.1,000 కోట్లు చొప్పున మూడు బాండ్లు) అప్పు కోసం ప్రభుత్వం ఇండెంట్ పెట్టింది. ఇందులో రూ.1,000 కోట్ల విలువ చేసే మూడు సెక్యూరిటీ బాండ్లను వేలానికి పెట్టింది. మొదటి రూ.1,000 కోట్ల బాండు 14 ఏళ్లు, రెండో రూ.1,000 కోట్ల బాండు 20 ఏళ్లు, మూడో రూ.1,000 కోట్ల బాండు 24 ఏళ్ల కాల పరిమితి ఉంటుంది.

**అక్టోబర్ 29న రూ.3,000 కోట్లు..**

అక్టోబర్ 29న నిర్వహించిన స్టేట్ గవర్నమెంట్ సెక్యూరిటీస్ వేలంలో.. రూ. 3,000 కోట్ల (ఒక్కొక్కటి రూ.1,000 కోట్లు చొప్పున మూడు బాండ్లు) అప్పునకు ప్రభుత్వం ఇండెంట్ పెట్టింది. ఇందులో రూ.1,000 కోట్ల విలువ చేసే మూడు సెక్యూరిటీ బాండ్లను వేలానికి పెట్టింది. మొదటి రూ.1,000 కోట్ల బాండు 15 ఏళ్లు, రెండో రూ.1,000 కోట్ల బాండు 19 ఏళ్లు, మూడో రూ.1,000 కోట్ల బాండు 23 ఏళ్ల కాల పరిమితి ఉంటుంది.

# పోలవరంపై వైసీపీ రాజకీయాలు

**ఏలూరు, నవంబర్ 2, పెన్ పవర్:** ఎన్డీఏలో టిడిపి కీలక భాగస్వామిగా ఉంది. ఏపీ విషయంలో కేంద్రం సానుకూలంగా స్పందిస్తోంది. అయితే ఇదే అదునుగా చాలా విషయాలను తెరపైకి తెస్తున్నారు జగన్. చంద్రబాబుకు ట్రాప్ చేసే పనిలో పడ్డారు.పోలవరం ప్రాజెక్టుపై కూటమి ప్రభుత్వం ప్రత్యేకంగా ఫోకస్ పెట్టింది. వీలైనంత త్వరగా పూర్తి చేయాలన్న ఆలోచనతో ఉంది. కేంద్ర ప్రభుత్వం సైతం సానుకూలంగా స్పందించింది. అమరావతి రాజధానితో పాటు పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి సహాయం అందిస్తామని హామీ ఇచ్చింది. అంతవరకు ఓకే కానీ మరోసారి పోలవరం ప్రాజెక్టును రాజకీయం చేసే పనిలో పడింది వైసిపి. ఈ ఎన్నికల్లో వైసీపీ దారుణ పరాజయం చవిచూసింది. కనీసం ప్రతిపక్ష హోదా కూడా దక్కలేదు. ఈ తరుణంలో ఏపీలో ఎలా పుంజుకోవాలి అని ఆలోచిస్తోంది వైసిపి. గత ఐదేళ్లుగా వైసీపీ ప్రభుత్వం పై వ్యతిరేకత పెంచడంలో పోలవరం ప్రాజెక్టు ఒక అస్త్రంగా మారింది అప్పటి విపక్షాలకు. ఇప్పుడు అదే పోలవరం ప్రాజెక్టును అడ్డం పెట్టుకుని టిడిపి కూటమి ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టాలని భావిస్తోంది వైసిపి. ముఖ్యంగా పోలవరం ప్రాజెక్టు ఎత్తు విషయంలో అభ్యంతరాలు వ్యక్తం చేస్తోంది. కేంద్రంలో కీలక భాగస్వామిగా ఉన్న టిడిపి ఈ విషయంలో ఏం చేస్తున్నట్టు అని జగన్ ప్రశ్నిస్తున్నారు. పోలవరం ఎత్తు తగ్గించేస్తున్నారని.. అయినా చంద్రబాబు స్పందించడం లేదని వైసీపీ అధినేత తాజాగా ప్రశ్నించారు. రాష్ట్ర భవిష్యత్తుకు దిక్సూచిగా నిలిచే పోలవరం విషయంలో చంద్రబాబు చేస్తున్న నిర్లక్ష్యం రాష్ట్రానికి శాపంగా మారుతుందని ఆందోళన వ్యక్తం చేశారు జగన్. పోలవరం ప్రాజెక్టు గరిష్ట ఎత్తు 45.72 మీటర్లకే సవరించిన అంచనాలకు ఒప్పించాలని ఆయన తాజాగా డిమాండ్ చేశారు. చంద్రబాబుకు వ్యతిరేకంగా ట్వీట్ చేశారు.వాస్తవానికి పోలవరం గరిష్ట ఎత్తు 45.72 మీటర్లుగా డిజైన్ చేశారు. అయితే దానిని 41.15 మీటర్లకు తగ్గించారన్నది వైసీపీ నుంచి వస్తున్న ఆరోపణ. దీంతో నీటి నిల్వ సామర్థ్యం తగ్గుతుందని.. 194.6 టీఎంసీలు ఉండాల్సిన నీటి నిల్వ.. 115 టీఎంసీలకే పడిపోతుందని వైసిపి కొత్త వాదనలను తెరపైకి తెచ్చింది. నిపుణులు సైతం ఆందోళన వ్యక్తం చేస్తున్నారని చెబుతోంది. ఎత్తు తగ్గింపు వల్ల కుడి ఎడమ ప్రధాన కాలువల పరిధిలో శివారు ఆయకట్టుకు నీరు అందదని ఆందోళన వ్యక్తం చేస్తోంది వైసిపి. 2018లో తెచ్చిన డిమాండ్లను జగన్ తెరపైకి తేవడం విశేషం. అప్పట్లో విభజన హామీల అమలు విషయంలో కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేలేకపోయారని జగన్ ఆరోపించారు.కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వంలో కీలక భాగస్వామిగా ఉన్న ఏపీకి ఎటువంటి ప్రయోజనం లేకుండా పోయిందని జగన్ చెప్పుకొచ్చేవారు. పదేపదే ఎన్డీఏ నుంచి బయటకు రావాలని సవాల్ చేసేవారు. అదే సమయంలో వైసీపీ బీజేపీతో స్నేహానికి





తహతహలాడేది. ఈ తరుణంలో చంద్రబాబు జగన్ ట్రాప్ లో పడ్డారు. వన్ ఫైన్ మార్నింగ్ ఎన్డీఏ నుంచి బయటకు వచ్చేసారు. అప్పటినుంచి చంద్రబాబుకు, తెలుగుదేశం పార్టీకి కష్టాలు ప్రారంభమయ్యాయి. మరోసారి అదే వ్యూహంతో జగన్ ముందుకు కదులుతున్నట్లు తెలుస్తోంది. అయితే గత అనుభవాల దృష్ట్యా చంద్రబాబు వెనక్కి తగ్గుతారా? జగన్ ట్రాప్ లో పడతారా? అన్నది తెలియాల్సి ఉంది.

## ఫ్రీ బస్సుపై పునరాలోచన



**తిరుపతి, నవంబర్ 2, పెన్ పవర్:** ఉచిత బస్సు ప్రయాణంపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పునరాలోచనలో పడే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఎన్నికలకు ముందు ఆంధ్రప్రదేశ్ లో ఉండే ఏ మహిళకైనా ఉచిత బస్సు ప్రయాణాన్ని కల్పిస్తామని చంద్రబాబు నాయుడు ప్రకటించారు. ఈ ఎన్నికల హామీని ఇప్పటి వరకూ అమలు చేయలేదు. అందుకు కారణాలు కూడా అనేకం ఉన్నాయి. ఎన్నికల సమయంలో చెప్పారు కానీ, తర్వాత ఆ పథకం అమలులో అనేక ఇబ్బందులు తలెత్తే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఉచిత బస్సు ప్రయాణాన్ని అమలు చేస్తున్న రెండు రాష్ట్రాలైన కర్ణాటక, తెలంగాణలో అధ్యయనం చేసి వచ్చిన అధికారులు అందులో లోటుపాట్లను కూడా చంద్రబాబుకు వివరించినట్లు తెలిసింది.మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంలో ప్రయోజనం కంటే నష్టమే ఎక్కువగా కనిపిస్తుందని అధ్యయనంలో వెల్లడయిందని తెలిసింది. అందువల్లనే ఈ పథకం అమలు చేయకుండా చంద్రబాబు ఎప్పటికప్పుడు వాయిదా వేస్తున్నట్లు పార్టీ సీనియర్ నేతలు కూడా అభిప్రాయపడుతున్నారు. ఒకవైపు ఆటో డ్రైవర్ల నుంచి నిరసనలు వస్తాయని భావించడంతో పాటు సరిపడా ఆర్టీసీ బస్సులు లేకుండా ఈ ఉచిత బస్సు ప్రయాణాన్ని మహిళలకు అందుబాటులోకి తెస్తే నగుబాటుకు గురవుతామని ఆయన పునరాలోచనలో పడినట్లు తెలిసింది. ఇప్పుడున్న రాష్ట్ర ఆర్థిక పరిస్థితుల్లో కొత్త ఆర్టీసీ బస్సులను కొనలేని స్థితి. రాష్ట్ర వ్యాప్తంగా ఆర్టీసీ బస్సుల సంఖ్య పెంచాల్సి ఉంటుంది. ఇక విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి వంటి నగరాల్లో కూడా సిటీ బస్సుల సంఖ్యను కూడా పెంచాల్సి ఉంటుందిఇప్పటికే తెలంగాణలో ఉచిత బస్సు ప్రయాణంతో పురుషుల్లో ఒకింత వ్యతిరేకత వ్యక్తమవుతుంది. వారికి ఆర్టీసీ బస్సుల్లో చోటు కూడా దక్కడం లేదు. మహిళలు ఉచితం కావడంతో రాష్ట్రమంతటా ప్రయాణిస్తుండటంతో పురుషులు సీట్లు దొరకక ఇబ్బందులు పడుతున్నారు. తెలంగాణ ప్రభుత్వం నెలకు నాలుగు వందల కోట్ల రూపాయలు వెచ్చించాల్సి ఉంటుంది. నెలకు ఈ నాలుగు వందల కోట్ల రూపాయలను ఆర్టీసీకి రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సి వస్తుంది. అదనపు బస్సులు కొనుగోలు చేసినా ఫలితం ఉండటం లేదు. పురుషులు ఆర్డినరీ సర్వీసుల్లో వెళ్లడం మానుకుని ఇక ఉచితం లేని బస్సుల్లో మాత్రమే కొంత అదనంగా డబ్బు చెల్లించి ప్రయాణం చేయాల్సి వస్తుంది.మరోవైపు కర్ణాటక రాష్ట్రంలోనూ మహిళల ఉచిత బస్సు ప్రయాణంపై అక్కడి ప్రభుత్వం పునరాలోచనలో పడింది. అయితే ఈ పథకాన్ని కొనసాగిస్తామని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య చెప్పినప్పటికీ ఖజానాకు భారంగా మారిందని ఎక్కువ మంది కాంగ్రెస్ నేతలు అభిప్రాయపడుతున్నారు. ఈ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అందుబాటులోకి వచ్చే అవకాశం ఇప్పట్లో కనిపించడం లేదు. అంతా సెట్ అయిన తర్వాత, ఖజానా కొంత కుదురుపడిన తర్వాత ఈ పథకం గ్రౌండ్ చేయాలని చంద్రబాబు ఆలోచిస్తున్నారని సమాచారం. అప్పటి వరకూ హోల్డాన్ లో ఈ ప్రతిపాదనను పెట్టారన్న టాక్ బలంగా వినిపిస్తుంది. సో.. ఏపీ మహిళలకు ఇది బ్యాడ్ న్యూస్ అని చెప్పాలి.

## ఎన్వీ రమణకు కీలక పదవి....

**విజయవాడ, నవంబర్ 2, పెన్ పవర్:** టీటీడీ ట్రస్ట్ బోర్డు చైర్మన్ పదవి అనూహ్య వ్యక్తికి ఇస్తారని ప్రచారం జరిగింది. తెరపైకి రకరకాల వ్యక్తుల పేర్లు వచ్చాయి. టీటీడీ లడ్డు వివాదం నేపథ్యంలో.. రాజకీయ ముద్ర లేనటువంటి వ్యక్తికి ఆ పదవి ఇస్తారని తెగ ప్రచారం నడిచింది. ముఖ్యంగా సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వి రమణ పేరు జోరుగా వినిపించింది.రాష్ట్రం నుంచి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా ఎంపికయ్యారు ఎన్వి రమణ. కొద్ది రోజుల కిందటే ఆయన పదవీ విరమణ చేశారు. ఏపీ రాష్ట్రంపై ప్రత్యేక దృష్టితో ఉండేవారు. పైగా చంద్రబాబు కు అత్యంత సన్నిహితుడు కూడా. చంద్రబాబు విజన్ అంటే ఎన్వి రమణకు ఎంతో ఇష్టం. తిరుమల లడ్డు వివాదం నేపథ్యంలో మాజీ న్యాయ కోవిదుడు అయిన.. ఎన్వి రమణకు టీటీడీ అధ్యక్ష పీఠం ఇస్తే మంచి సంప్రదాయానికి తెర తీసినట్టు అవుతుందని విశ్లేషణలు వచ్చాయి.ఆయన తప్పకుండా పదవి తీసుకుంటారని ప్రచారం కూడా జరిగింది. కూటమి ప్రభుత్వం ఆయనను సంప్రదించినట్లు కూడా టాక్ నడిచింది. కానీ అనూహ్యంగా 24 మంది సభ్యులతో కూడిన టిటిడి ట్రస్ట్ బోర్డును ప్రకటించింది కూటమి ప్రభుత్వం. చైర్మన్ గా టీవీ5 అధినేత బిఆర్ నాయుడు పేరును ఖరారు చేసింది. ఎక్కడ ఎన్వి రమణ పేరు వినిపించలేదు. అయితే టీటీడీ కంటే ప్రతిష్టాత్మకమైన ఓ పదవి ఎన్వి రమణకు వరించబోతుందని కొత్త టాక్ ప్రారంభం అయ్యింది.పునరుత్పాదక ఇంధన రంగంలో ఏపీని అగ్రభాగంలో నిలపాలన్నది చంద్రబాబు లక్ష్యం. దేశంలోనే ప్రథమ స్థానంలో నిలబెట్టాలని చంద్రబాబు ఆలోచన చేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి ని కీలకంగా భావిస్తున్నారు. దానికి చైర్మన్ గా ఎన్వి రమణను ప్రకటిస్తారని తెలుస్తోంది. ఏపీ ఈ ఆర్ సి చైర్మన్ హోదా అంటే క్యాబినెట్ తో సమానం. అటువంటి పదవిని ఎన్వి రమణకు ఇవ్వాలని చంద్రబాబు ఆలోచన చేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. వైసీపీ హయాంలో ఏపీ ఈ ఆర్ సి చైర్మన్ గా జస్టిస్ నాగార్జున రెడ్డి వ్యవహరించారు. ఈయన కూడా సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా పనిచేశారు. ఇటీవలే నాగార్జున రెడ్డి పదవీకాలం ముగిసింది. కొత్త వ్యక్తి నియామకం అనివార్యంగా మారింది. దానికి ఎన్వి రమణ పేరు బలంగా వినిపిస్తోందిఎన్వి రమణ చంద్రబాబుతో మంచి సంబంధాలు కలిగి ఉన్నారు. ఒకానొక దశలో వారి మధ్య సంబంధాలే ఇబ్బందికరంగా మారాయి. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా ఎన్వి రమణ పేరు ఖరారు చేస్తూ కొలీజియం నిర్ణయం తీసుకుంది. అప్పట్లో ఏపీ సీఎం గా ఉన్న జగన్ ఏకంగా ఎన్వి రమణ నియామకంపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ లేఖ రాసినట్లు వార్తలు వచ్చాయి. కేవలం చంద్రబాబుకు సన్నిహితుడు కావడంతోనే అప్పట్లో జగన్ అలా వ్యవహరించినట్లు టాక్ నడిచింది. అందుకే టీటీడీ ట్రస్ట్ బోర్డు చైర్మన్ విషయంలో కూటమి ప్రభుత్వం ఎన్వి రమణను సంప్రదించిందని.. కానీ ఆయన సున్నితంగా తిరస్కరించినట్లు ఒక రకమైన వార్త బయటకు వచ్చింది. అయితే ఇప్పుడు ఏపీ ఈ ఆర్ సి చైర్మన్ గా ఎన్వి రమణ బాధ్యతలు తీసుకుంటారా? పదవికి సమ్మతిస్తారా? లేదా? అన్నది చూడాలి.



## హోంగార్డుల చలో హైదరాబాద్

**హైదరాబాద్ పెన్ పవర్:** తమ సమస్యల పరిష్కారం కోసం హోంగార్డులు ఆందోళనలకు సిద్ధమయ్యారు. డిమాండ్ల సాధన కోసం హైదరాబాద్లోని ఇందిరాపార్క్ వద్ద నేడు శాంతియుతంగా నిరసన తెలిపేందుకు సన్నద్ధమయ్యారు. ప్రతిపక్షంలో ఉండగా తమకు అనేక హామీలిచ్చి ఊరించిన కాంగ్రెస్ నేతలు, అధికారంలోకి వచ్చాక వినతి పత్రాలు కూడా తీసుకునేందుకు ముఖం చాటేస్తున్నారని మండిపడ్డారు. ఇతర ఉద్యోగ సంఘాలతో పాటు హోంగార్డులను కూడా ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి పిలిచి చర్చించాలని, తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్లో ఆందోళనలపై ఆంక్షలు ఉన్నా వెనక్కి తగ్గేది లేదని, శాంతియుతంగానే నిరసన తెలుపుతామని స్పష్టంచేశారు.

# అదృష్టం అంటే ఇతనిదే.. ఏడాదిలో 70 రెట్లు పెరిగిన ఐపీఎల్ జీతం




**హైదరాబాద్ పెన్ పవర్:** ఐపీఎల్ అంటేనే ఆటగాళ్లకు కాసుల పండగ. ప్రపంచ క్రికెట్ లో ఎక్కడా సంపాదించలేని డబ్బు ఒక్క ఐపీఎల్ ద్వారా సంపాదించుకోవచ్చు. టాలెంట్ ఉన్న ఆటగాళ్లు తమ ప్రతిభ నిరూపించుకుంటే ఎంత డబ్బు అయినా ఇవ్వడానికి ఫ్రాంచైజీలు వెనుకాడరు. ఐపీఎల్ 2025 మెగా ఆక్షన్ కావడంతో ఈ సారి ఎవరు కోట్లు కొల్లగొడతారో ఆసక్తి నెలకొంది. అయితే అంతకంటే ముందు రిటెన్షన్ లో ఫ్రాంచైజీలు తమ స్టార్ ప్లేయర్లను వారికి స్థాయికి తగ్గట్టు కోట్లు పెట్టి తీసుకున్నారు. 2024 ఐపీఎల్ తో పోలిస్తే అందరి శాలరీ పెరిగింది. అయితే అందరికంటే ఎక్కువగా ఎవరు ఎక్కువ తీసుకున్నారో ఇప్పుడు చూద్దాం. ఐపీఎల్ 2025 రిటెన్షన్ లో సన్ రైజర్స్ ఆటగాడు హెన్రిక్ క్లాసన్ కు అత్యధికంగా రూ. 23 కోట్ల రూపాయలు తీసుకున్నారు. ఆ తర్వాత విరాట్ కోహ్లీ, నికోలస్ పూరన్ రూ. 21 కోట్లతో తమ జట్లతో కొనసాగనున్నారు. ఇదిలా ఉంటే.. 2024 తో పోలిస్తే రాజస్థాన్ రాయల్స్ ఆటగాడు ధృవ్ జురెల్ ఎక్కువ శాలరీ తీసుకుంటున్నాడు. అతనికి ఏకంగా రాజస్థాన్ యాజమాన్యం రూ.14 కోట్లు ఇచ్చి తీసుకుంది. 2024 ఐపీఎల్ లో జురెల్ కేవలం రూ. 20 లక్షల రూపాయలతో జట్టులో ఉన్నాడు. కానీ 2025 లో మాత్రం అతనికి ఏకంగా రూ. 14 కోట్ల రూపాయలు దక్కాయి. వికెట్ కీపర్ బ్యాటర్ గా జురెల్ రాజస్థాన్ జట్టులో మెరుపు ఇన్నింగ్స్ లు ఆడాడు. టీమిండియా టెస్ట్ జట్టులోనో చోటు సంపాదించి తనను తాను నిరూపించుకున్నాడు. భవిష్యత్ లో భారత టీ20 జట్టులో ఆడే అవకాశాలు పుష్కలంగా కనిపిస్తున్నాయి. ఈ కారణంగానే జురెల్ కు ఇంత భారీ మొత్తంలో ఇచ్చినట్టు తెలుస్తుంది. జురెల్ తో పాటు రింకూ సింగ్, మతీష పతిరానా, మయాంక్ యాదవ్ లు కూడా 2024 లో కోటి రూపాయల కంటే తక్కువ శాలరీతో గా వచ్చి 10 కోట్లకు పైగా తమ తమ జట్లలో కొనసాగనున్నారు.

# 6 బంతుల్లో 6 సిక్సర్లు.. ఊతప్ప తాటతీసిన బొపారా

**హైదరాబాద్ పెన్ పవర్:** హాంకాంగ్ సిక్సస్ టోర్నీలో టీమిండియా హ్యాట్రిక్ ఓటములు మూటగట్టుకుంది. తొలిరోజు దాయాది పాకిస్థాన్, పసికూన యూఏఈ చేతిలో భంగపోయిన భారత జట్టు.. రెండో రోజూ అదే ఫలితాన్ని పునరావృతం చేసింది. ఇంగ్లండ్ చేతిలో 15 పరుగుల తేడాతో ఓటమిపాలైంది. ఈ మ్యాచ్‌లో భారత మాజీ బ్యాటర్ రాబిన్ ఊతప్ప ఒకే ఓవర్‌లో 37 పరుగులు సమర్పించుకున్నాడు. ఇందులో 6 సిక్సర్లు ఉండటం గమనార్హం. ఇంగ్లండ్ ఇన్నింగ్స్ నాలుగో ఓవర్‌లో ఊతప్ప ఈ చెత్త ఘనత సాధించాడు. పార్ట్ టైమ్ ఆఫ్ స్పిన్నర్‌గా అవతారమెత్తిన ఈ మాజీ భారత బ్యాటర్ కొట్టుకోండి అన్నట్లుగా బంతులేశాడు. ఇదే మంచి అవకాశం అనుకున్న ఇంగ్లీష్ మాజీ క్రికెటర్ రవి బొపారా.. ఏకంగా ఆ ఓవర్‌లో 6 బంతులను స్టాండ్స్‌లోకి పంపాడు. అంతటితో అతని విధ్వంసం ఆగలేదు. షాబాజ్ నదీమ్ వేసిన ఆ మరుసటి ఓవర్‌లో తాను ఎదుర్కొన్న తొలి బంతిని సిక్సర్‌గా మలిచాడు. దాంతో, కేవలం 14 బంతుల్లో అర్ధ సెంచరీని పూర్తి చేసుకున్నాడు. అనంతరం టోర్నీ నియమనిబంధనల ప్రకారం 53 (14) పరుగులు చేసి రిటైరయ్యాడు. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన ఇంగ్లండ్ నిర్ణీత ఆరు ఓవర్లలో వికెట్ నష్టపోయి 120 పరుగులు చేసింది. ఛేదనలో టీమిండియా నిర్ణీత ఓవర్లలో 105 పరుగులకే పరిమితమైంది. ఇప్పటికే ఆడిన మూడింట ఓటమిపాలైన భారత్.. టోర్నీ నుంచి అధికారికంగా నిష్క్రమించింది.




# ఛాంపియన్స్ ట్రోఫీ... టీమిండియా అభిమానుల కోసం పీసీబీ కీలక నిర్ణయం!

- వచ్చే ఏడాది ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీకి ఆతిథ్యం ఇస్తున్న పాకిస్థాన్
- ఈ ట్రోఫీ కోసం భారత జట్టును పాక్‌కు పంపించేదిలేదంటున్న బీసీసీఐ
- వస్తుందనే ఆశాభావంతో పాకిస్థాన్ క్రికెట్ బోర్డు
- తమ దేశానికి వచ్చే భారత ఫ్యాన్స్‌కు త్వరితగతిన వీసాలిస్తామని పీసీబీ ప్రకటన
- భారత అభిమానుల కోసం ప్రత్యేక టికెట్ల కోటాను ఉంచుతామన్న మొహిసిన్ నఖ్వీ




**హైదరాబాద్ పెన్ పవర్:** వచ్చే ఏడాది ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీకి పాకిస్థాన్ ఆతిథ్యం ఇవ్వనుంది. దీంతో ఈ మెగా టోర్నీ కోసం ఇప్పటికే పీసీబీ (పాకిస్థాన్ క్రికెట్ బోర్డు) సన్నాహాలు చేస్తోంది. కాగా, ఛాంపియన్స్ ట్రోఫీ కోసం టీమిండియా దాయాది దేశానికి వెళ్లే విషయమై సందిగ్ధత నెలకొంది. ఎట్టిపరిస్థితుల్లో ఈ ట్రోఫీ కోసం జట్టును పాక్‌కు పంపించేదిలేదని బీసీసీఐ చెబుతోంది. మరోవైపు ఈ మెగా ఈవెంట్ కోసం భారత జట్టు తమ దేశానికి రావాలని, వస్తుందని పీసీబీ ఆశాభావంతో ఉంది. ఈ క్రమంలోనే టీమిండియా ఫ్యాన్స్ కోసం పీసీబీ తాజాగా కీలక నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ మ్యాచులను ప్రత్యక్షంగా వీక్షించేందుకు తమ దేశానికి రావాలనుకునే భారత అభిమానులకు వీలైనంత త్వరగా వీసాలు జారీ చేస్తామని పాకిస్థాన్ క్రికెట్ బోర్డ్ ఛైర్మన్ మొహిసిన్ నఖ్వీ చెప్పారని ఓ న్యూస్ ఏజెన్సీ తన కథనంలో పేర్కొంది. లాహోర్ వేదికగా జరిగే దాయాది దేశాల మ్యాచ్‌ను భారత అభిమానులు పాక్ వచ్చి చూడాలని నఖ్వీ కోరినట్లు తెలిపింది."ఛాంపియన్స్ ట్రోఫీ కోసం భారత జట్టు మా దేశానికి వస్తుందనే ఆశాభావంతో ఉన్నాం. టీమిండియా ఫ్యాన్స్ కోసం వేగంగా వీసాలు జారీ చేసేందుకు తగిన చర్యలు తీసుకుంటాం. వారి కోసం ప్రత్యేక టికెట్ల కోటాను ఉంచడం జరుగుతుంది. పాకిస్థాన్‌లో జరిగే ఛాంపియన్స్ ట్రోఫీలో అన్ని జట్లకు మేము ఆతిథ్యం ఇస్తాం. భారత జట్టు ఇక్కడికి రావాలి. వారు ఇక్కడికి రారని నేను అనుకోవట్లేదు" అని పీసీబీ ఛైర్మన్ మొహిసిన్ నఖ్వీ ఓ వార్తా పత్రికకు తెలిపారు.ఇదిలాఉంటే... 2008లో ముంబయి ఉగ్రదాడి జరిగినప్పటి నుంచి పాక్‌లో టీమిండియా పర్యటించడం మానేసింది. రెండు దేశాల మధ్య ద్వైపాక్షిక టోర్నీలు జరగడం లేదు. ఇరు జట్లూ ఐసీసీ టోర్నీల్లో మాత్రమే తలపడుతున్నాయి. దీనిలో భాగంగా పాకిస్థాన్ జట్టు భారత్‌కు వచ్చి మ్యాచ్‌లు ఆడుతోంది. కానీ, టీమిండియా మాత్రం తటస్థ వేదికల్లో మాత్రమే తలపడుతోంది. ఇప్పుడు ఛాంపియన్స్ ట్రోఫీలో భాగంగా వచ్చే ఏడాది ఫిబ్రవరి 23న భారత్, పాక్ మధ్య మ్యాచ్ జరగాల్సి ఉంది. కానీ, భారత జట్టు పాక్ వెళ్లడం దాదాపు అసాధ్యం. తటస్థ వేదికలో తమ మ్యాచ్‌లను నిర్వహించాలని బీసీసీఐ కోరుతోంది.



ఆషు రెడ్డి తన స్టైల్‌లో గ్రీన్ లెహంగాను చంపేసింది

# జిమ్ లో వర్ష హార్డ్ వర్క్.. స్టన్నింగ్ లుక్




**హైదరాబాద్ పెన్ పవర్:** సౌత్ లో మోస్ట్ టాలెంటెడ్ యాక్టర్స్ లలో తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపు సొంతం చేసుకున్న నటి వర్ష బొల్లమ్మ. సతురన్ అనే తమిళ్ మూవీతో వర్ష బొల్లమ్మ హీరోయిన్ గా కెరియర్ స్టార్ట్ చేసింది. తరువాత కళ్యాణం అనే చిత్రంతో మలయాళీ ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చింది. 2020లో చూసి చూడంగానే సినిమాతో వర్ష తెలుగులోకి హీరోయిన్ గా అడుగుపెట్టింది. మూడు భాషలలో కూడా వర్ష బొల్లమ్మకి యాక్టర్ గా మంచి ఇమేజ్ ఉంది. ఆమె చేసిన ప్రతి సినిమాలో కూడా మంచి పెర్ఫార్మెన్స్ కి స్కోప్ ఉన్న పాత్రలలోనే వర్ష కనిపించింది. ఆమె తన నటనతోనే ప్రేక్షకుల ప్రశంసలు సొంతం చేసుకొని అవకాశాలు దక్కించుకుంటుంది. వర్ష బొల్లమ్మ చివరిగా ఊరు పేరు భైరవకోన సినిమాలో శర్వానంద్ కి జోడీగా నటించింది. ఈ సినిమా కమర్షియల్ సక్సెస్ అందుకోలేదు. ప్రస్తుతం అయితే వర్ష చేతులో పెద్దగా సినిమాలు లేవు. %ూశ్రీంశీ =ఘుం% – హీరోయిన్‌ని వదిలేసి పారిపోయిన ప్రియుడు అయిన కూడా ఈ బ్యూటీ సోషల్ మీడియాలో చాలా యాక్టివ్ గా ఉంటుంది. ముఖ్యంగా ఇన్ స్టాగ్రామ్ లో రెగ్యులర్ గా వర్ష తన అప్డేట్స్ ని షేర్ చేసుకుంటూ ఉంటుంది. దీంతో ఇన్ స్టాగ్రామ్ లో వర్షకి మంచి ఫ్యాన్ ఫాలోయింగ్ ఉంది. ఆమె ఇన్ స్టాగ్రామ్ లో గ్లామర్ పిక్స్ కంటే డిఫరెంట్ స్టైల్ లో తనని తాను రిప్రజెంట్ చేసుకుంటూ ఫోటోలని పంచుకుంటూ ఉంటుంది. తాజాగా ఇన్ స్టాగ్రామ్ లో ఈ అమ్మడు జిమ్ లో వర్క్ అవుట్స్ చేసిన తర్వాత అద్దం ముందు నిలబడి సెల్ఫీ తీసుకుంది. ఈ పిక్స్ ని ఇన్ స్టాగ్రామ్ లో షేర్ చేసింది. ఈ ఫోటోలో వర్ష చాలా స్లిమ్ గా కనిపిస్తోంది. ఫేస్ లో డిఫరెంట్ ఎక్స్ ప్రెషన్ పెట్టి సెల్ఫీకి ఫోజులిచ్చింది. ఈ పిక్ పై ఇన్ స్టాగ్రామ్ లో చాలా ఫన్నీ కామెంట్స్ వస్తున్నాయి. ఇలాంటి ఫన్నీ ఫోటోలని వర్ష రెగ్యులర్ గా ఇన్ స్టాగ్రామ్ లో షేర్ చేస్తూ ఫ్యాన్స్ కి వినోదాన్ని అందిస్తూ ఉంటుంది.



జ్ఞానేశ్వరి కాండ్రేగుల గోళ్లు సింపుల్‌గా కనిపిస్తున్నాయి

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh. Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh.
Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, e-mail:penpower9@gmail.com